

సీఎం చంద్రబాబు సమక్షంలో ఎన్‌యూ, ఆస్ట్రేలియాలోని కర్టిన్ యూనివర్సిటీ మధ్య విద్యార్థుల మార్పిడికి ఒప్పందం దృశ్యం

# ఆంధ్రతో ఆర్థిక బంధం

## సీఎంతో పశ్చిమ ఆస్ట్రేలియా బృందం భేటీ

- ప్రపంచ స్థాయి మైనింగ్ వర్సిటీ ఏర్పాటు
- కేంద్రం ఆమోదం తర్వాత ఒప్పందాలు

అమరావతి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గనులు, రవాణా, వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తామని పశ్చిమ ఆస్ట్రేలియా రాష్ట్ర ఉపప్రధాని రోజర్ కుక్ చెప్పారు. ఆయా రంగాల్లో పెట్టుబడులతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. కుక్ నేతృత్వంలోని పశ్చిమ ఆస్ట్రేలియా బృందం గురువారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమైంది. ఆ రాష్ట్రంలో సోదర రాష్ట్ర ఒప్పందం 2016 డిసెంబరులో జరిగిన నేపథ్యంలో.. గురువారం నాటి భేటీలో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మండలి (ఈడీబీ), గనులు, విద్య, వైద్య శాఖల అధికారుల సమక్షంలో వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో ప్రపంచస్థాయి మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు, జియోలాజికల్ మ్యాపింగ్ అంశంపై చర్చలు జరిగాయి. మైనింగ్ వర్సిటీ కోసం కర్టిన్ యూనివర్సిటీతో, జియోమ్యాపింగ్‌కు సాంకేతిక సహకారంపై పశ్చిమ ఆస్ట్రేలియా జియోలాజికల్ సర్వే విభాగంతో ఒప్పందాలు కుదుర్చుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. వీటితోపాటు పలు పెట్టుబడులు, సహకారానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించాక ఒప్పందాలు కుదుర్చుకోవాలని నిర్ణయించారు. పశ్చిమ ఆస్ట్రేలియాకు చెందిన కంపెనీలు ఇప్పటికే రాష్ట్రంలో పని చేస్తున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. తిరుపతి ఘాట్ రోడ్డులో ప్రమాదాలు జరిగినా ప్రాణనష్టాన్ని నివారించేలా ఆస్ట్రేలియా పరిజ్ఞానాన్ని వినియోగిస్తామని, ఈడీబీతో కలిసి ఉపాధి కల్పన, టూరిజం, ఇతర రంగాల అభివృద్ధికి ఆస్ట్రేలియా సహకరిస్తుందని చెప్పారు. ఇది ప్రారంభం మాత్రమేనని పేర్కొన్నారు. త్వరలో తాను పశ్చిమ ఆస్ట్రేలియాకు వెళ్లనున్నట్లు సీఎం ప్రకటించారు. కాగా.. గురువారం నాగార్జున విశ్వవిద్యాలయం. ఆస్ట్రేలియాలోని కర్టిన్ యూనివర్సిటీ మధ్య విద్యార్థుల పరస్పర మార్పిడికి ఒప్పందం కుదిరింది.

### మన జనాభాలో 20వ వంతు

ఆంధ్రప్రదేశ్ జనాభాలో పశ్చిమ ఆస్ట్రేలియా జనాభా కేవలం 20వ వంతే ఉంటుందని, కానీ జీడీపీ మనకంటే రెట్టింపు ఉందని సీఎం పేర్కొన్నారు. 26 లక్షల చ.కి.మీ. విస్తీర్ణంలో ఉన్న పశ్చిమ ఆస్ట్రేలియా జనాభా 26 లక్షలని, జీడీపీ 240 బిలియన్ డాలర్లుగా ఉందని పేర్కొన్నారు. ఐదు కోట్ల జనాభా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో జీఎస్డీపీ 120 బిలియన్ డాలర్లు మాత్రమేనని తెలిపారు. ఆంధ్రకు దార్శనికుడైన సీఎం ఉన్నారని, రెండంకెల వృద్ధి రేటును సాధించడం రాష్ట్రానికున్న అపారమైన ఆర్థిక శక్తిని రుజువు చేస్తోందని రోజర్ కుక్ చెప్పారు.

ఆంధ్రజ్యోతి Fri, 01 September 2017
epaper.andhrajyothy.com/c/21761667